క్లుప్తంగా

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ అంశంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు స్థానిక డీఎల్‌టీసీ సహాయ సంచాలకులు ఎస్ ఉగాది రవి ఒక ప్రకటనలో తెలిపారు. షార్ట్ టర్మ్ కోర్స్‌గా అసోసియేట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. పదో తరగతి, ఆపైన ఉత్తీర్ణులైన వారు 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు డిసెంబర్ 7వ తేదీ లోగా ఫోన్ నెంబర్లు 94934 82414లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆయుధ డిపో ఏర్పాటుపై పునరాలోచన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో ప్రతిపాదిత నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ఏర్పాటుపై పునరాలోచిస్తున్నట్టు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2 వేల కోట్లు అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందనున్నట్టు పేర్కొన్నారు. అయితే స్థానిక ప్రజల మనోభావాలు, పలు సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రక్రియపై పునరాలోచన చేస్తున్నామని వివరించారు.

మందుల షాపును తలపించేలా మద్యం షాపు పేరు



రైల్వే గూడ్సు షెడ్ రోడ్డులో ఏర్పాటుచేసిన టానికి వైన్స్ షాపు

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం మద్యం షాపులకు వేలం నిర్వహించి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిన విషయం విదితమే. మద్యం షాపులకు పెట్టే పేర్ల విషయంలో ఎటువంటి ఆంక్షలు, అడ్డుగోడలు లేకపోవడంతో లాటరీలో మద్యం షాపులను దక్కించుకున్న వ్యక్తులు వీటికి చిత్ర విచిత్రమైన పేర్లు పెట్టి ఆయా మార్గంలో వచ్చి వెళ్లే ప్రజలు విస్తుపోయేవిధంగా చేస్తున్నారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్ నుంచి గూడ్స్ షెడ్ వైపు వెళ్లే మెయిన్ రోడ్డు పక్కగా షాపు నెం.12కు సంబంధించి మద్యం షాపు ఏర్పాటుచేశారు. దీనికి నిపున్స్ టానిక్ వైన్స్ అనే పేరు పెట్టారు. జబ్బుల నివారణకు మందులు లభిస్తాయని భావించిన అక్కడికి వచ్చే ప్రజలు అవాక్కవుతున్నారు.

వణికిస్తున్న చలిగాలులు

- ఏలూరు నగరంపై మంచు దుప్పటి
- రోజురోజుకూ పెరుగుతోన్న చలి



ఏలూరు నగరంలో ఉదయం మంచుతో

ఏలూరు టౌన్: రోజు రోజుకూ చలితీవ్రత పెరుగుతోంది. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు వదలడం లేదు. సాయంత్రం ఐదున్నర గంటల నుంచే శీతల గాలులు వీస్తున్నాయి. ఆరు గంటల నుంచి చలి వణికిస్తుంది. గత నాలుగు రోజుల నుంచి 20 కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదువుతుండటంతో ప్రజలు రాత్రి, తెల్లవారు జామున బయటకు రాలేకపోతున్నారు. తక్కువ ఉష్ణోగ్రతలు, శీతగాలుల నుంచి వ్యాధులు పొంచి ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉదయం కూలీలు, ఇతర పనులకు వెళ్లే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని, ఉదయం పూట వ్యాయామం వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ఈ ఏడాది చలి తీవ్రత అధికం

ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో నేలలో తేమ అధికంగా ఉంది. అలాగే జలవనరులు పుష్కలంగా ఉండటంతో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఏలూరు నగరంలో ఆ ప్రభావం సాయంత్రం నుంచే కనిపిస్తోంది. గతేడాది చలి తీవ్రత అంతగా కనిపించలేదు. 21 నుంచి 24 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది నవంబర్ 10వ తేదీ నుంచే చలి మొదలైంది. కాగా గత నాలుగు రోజుల నుంచి చలి తీవ్రత పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు 16 నుంచి 19 డిగ్రీలు నమోదయ్యాయి. పొగ మంచు తీవ్రత అధికంగా ఉంది.

అస్తమాతో జాగ్రత్త

ఆస్తమా ఉన్నవారు కోడిగుడ్లు, పాల ఉత్పత్తులు, చేపలు వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోరాదు. కూల్‌డ్రింక్స్, ఉప్పు అధికంగా ఉన్న పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న పదార్థాలు తీసుకోవాలి.

ఫ్రిజ్‌లో ఆహారం తినొద్దు

చలికాలంలో ఫ్రిజ్‌లో ఉండే ఆహార పదార్థాలు తినరాదు. వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. మద్యంతో పాటు టీ, కాఫీలను అధికంగా తాగడం మంచిదికాదు. మద్యానికి దూరంగా ఉండాలి. టీ, కాఫీ రోజుకు రెండు మూడు కప్పులకు మించి తీసుకోవద్దు. కషాయాలు, హెర్బల్ టీలు తాగొచ్చు. దీంతో శరీరం ఎప్పుడూ వెచ్చగా ఉంటుంది. తగినంత నీటిని తీసుకుంటే ద్రవాలు అంది జీవక్రియలు సరిగ్గా ఉంటాయి. చలికాలంలో జ్వరం, దగ్గు, జలుబు వంటివి మూడు రోజులకు మించి వేధిస్తుంటే వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

వ్యాయామం తప్పనిసరి

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లు అత్యసరమైన పని ఉంటే తప్ప బయటకు వెళ్లకూడదు. ఇంటి లోపల ప్రదేశాలు కూడా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. కిటికీలు, తలుపులు కచ్చితంగా మూసేవేయాలి. పండ్లు, కూరగాయలు, నట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఇన్‌ఫెక్షన్ రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.

గుండెకు చలి ముప్పు

వాతావరణంలో వచ్చే మార్పులు శరీరంపై రకరకాల ప్రభావాల్ని చూపిస్తాయి. చలికాలంలో హార్ట్ పేషెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలి. అడ్రినలిన్, నారిటలిన్ వంటి హార్మోన్ల లెవెల్స్‌లో మార్పులొస్తాయి. ఇవి రక్త ప్రసరణలో మార్పులు తెస్తాయి. చలి కాలం రక్తనాళాలు సహజంగా ముడుచుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఇలాంటప్పుడు కొలెస్ట్రాల్ వంటి సమస్యలు పెరిగితే ప్రమాదకరం. చలి కాలం గుండె సమస్యలున్నవాళ్లు వేడిగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలి. తేలికపాటి వ్యాయామాలు చేస్తుండటం ద్వారా రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చూసుకోవచ్చు.

జాగ్రత్తలు పాటించాలి



చలికాలంలో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. రోజూ ఉదయం సాయంత్రం 30 నిమిషాల పాటు సూర్యకాంతి పడేలా చూసుకోవాలి. విటమిన్ డీ, సీ అధికంగా ఉండే పదార్థాలు తీసుకోవాలి. చెవిలో చల్లగాలి వెళ్లకుండా చూడాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి.

– ఎ.హరికృష్ణ, నరాలు, ఊపిరితిత్తుల వైద్యనిపుణులు

కలెక్టర్ దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు



కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు తక్షణం ఇప్పించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్విని కోరినట్టు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై పీఆర్‌టీయూ నాయకులు, ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఎలక్షన్ డ్యూటీ చేసిన రోజులన్నింటిని సంబంధిత హాజరు ధ్రువీకరణ పత్రం ద్వారా ఉపాధ్యాయులకు మాత్రమే సంపాదిత సెలవు మంజూరవుతాయని పేర్కొన్నారు. డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించి డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావుకు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా డిసెంబర్ 7న నిర్వహించే మెగా పేరెంట్స్ సమావేశం ఏలూరు జిల్లాలో మరో తేదీకి వాయిదా వేయాలని, డిసెంబర్ 5 టీచర్ ఎమ్మెల్సీ ఎన్నిక ఉన్నందున ఉన్నత పాఠశాలలకు సెలవు ప్రకటించాలని కోరామని పేర్కొన్నారు.

ఎయిడ్స్‌తో ప్రాణాంతక పరిస్థితి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హ్యూమన్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్ వల్ల కలిగే ప్రాణాంతక పరిస్థితి ఎయిడ్స్ అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ ఎయిడ్స్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు మేనేజర్ కీర్తి శిరీష అన్నారు. డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఓఆర్‌డబ్ల్యూ బి.రామకృష్ణ మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, సెయింట్ థెరిస్సా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ మరియ క్రిస్టియా, రెడ్ క్రాస్ నోడల్ అధికారి చిట్టిమ్మ, రెడ్ రిబ్బన్ నోడల్ అధికారి వై.అరుణ ఝాన్సీ రాణీ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కె.శ్రీలత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పూజిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎయిడ్స్ మాయమయ్యే వరకు అలసత్వం తగదు

ఎయిడ్స్ మహమ్మారి ఉద్రిక్తత అవగాహన వల్ల తగ్గిందని, పూర్తిగామాయమయ్యే వరకు అలసత్వం తగదని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఉదయం కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే నిర్వహించారు. జంతుశాస్త్ర అధ్యాపకులు ఎం విజయకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం రాంబాబు, సీపీడీసీ మెంబర్ ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, రంగోలి, వక్తృత్వం అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు టీవీఎస్ పద్మావతి, టి.వెంకట దుర్గా ప్రసాద్, ఎస్ సుస్యలత, డి.సుజాత తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న విద్యార్థినులు

సాహిత్యమే ఆయుధంగా పోరాటం

మధ్యాహ్నం కళాశాలలో మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ సమాజంలోని దురాచారాలను, మూఢనమ్మకాలను రూపుమాపడానికి సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన యోధుడు మహాకవి గురజాడ అని కొనియాడారు. గురజాడ సాహిత్య అధ్యయనం నేటి విద్యార్థులకు కూడా అవసరమన్నారు. ముఖ్యఅతిథి కళాశాల సీపీడీసీ మెంబర్ ఎల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కన్యాశుల్కం లాంటి నాటకాన్ని, దేశభక్తి లాంటి గేయాన్ని రచించి గురజాడ తెలుగు సాహిత్యంలో యుగకర్తగా నిలిచారన్నారు.

పింఛన్ల పంపిణీ 94.25 శాతం పూర్తి

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో నవంబర్, 30వ తేదీ సాయంత్రానికి 94.25 శాతం పిఛన్ల పంపిణీ పూర్తయిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ సెలవు కావడంతో నవంబర్ 30నే పంపిణీ చేశామన్నారు. డిసెంబర్ నెల 2,62,836 మంది లబ్ధిదారుల్లో 2,47,722 మందికి పింఛన్లు అందజేశామని పేర్కొన్నారు.

బీసీల కులగణనకు డిమాండ్

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో బీసీల కులగణన తక్షణం చేపట్టాలని బీసీ సమన్వయ కమిటీ జిల్లా సమావేశం డిమాండ్ చేసింది. స్థానిక కెనాల్ రోడ్డులోని ప్రశాంతి వాకర్స్ అసోసియషన్ హాలులో శనివారం బీసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాలకృష్ణ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా బీసీలు ఉన్నారని, ఐనా రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించలేకపోతున్నారని వాపోయారు. బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఖచ్చితంగా బీసీ కులగణన చేయాలని కోరారు. ఎవరి కులం ఎంతో తెలిస్తే ఆయా కులాల దామాషా ప్రకారం ప్రభుత్వాలు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వెసులు బాటు ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్ర బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు, కన్వీనర్లు బీసీ రమణ, కుప్రా శ్రీనివాసరావు, సి.రాములు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న బీసీ నాయకులు

జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలూరు జిల్లా బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షునిగా సిరిబత్తిన విఠల్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బాయి వెంకట్రావు,లక్కోజు రాజగోపాలాచారి, ప్లాస్ శ్రీనివాస్, చిదరబోయిన శ్రీనివాస్, కిలారపు బుజ్జి, మల్లవరపు సత్యనారాయణ, మానికల వె ంకటేశ్వరరావు, పదిలం శ్రీనివాస్, వీర్ల శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, అదాని విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కో కన్వీనర్ ఆగొల్లు వెంకట కృష్ణారావులు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండు నెలల నుంచి ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపిందని పేర్కొన్నారు. గతంలో రూ.6072 కోట్లు, తరువాత రూ.11 వేల కోట్లు, ఇప్పుడు మరో రూ.9,412 కోట్లు భారాన్ని మోపిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ సన్నిహితుడు గౌతం అదాని దేశంలోని విద్యుత్తు సంస్థలను రూ.లక్ష కోట్ల విద్యుత్ ప్రాజెక్టును రూ.2000 కోట్లు అమెరికా కంపెనీలకు ఎర వేసి సంపాదించారని విమర్శించారు. తక్షణం పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని ఆదిశేషు, వెంకట కృష్ణారావులు డిమాండ్ చేశారు.

కామేశ్వరరావు పోరాటం స్ఫూర్తిదాయకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యుత్ కార్మికుల హక్కుల సాధన కోసం ఆత్మబలిదానం చేసిన నాయకుడు కామేశ్వరరావు పోరాట స్ఫూర్తిని ప్రతి ఉద్యోగీ అలవరుచుకోవాలని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజు పిలుపునిచ్చారు. విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకుడు దివంగత ఆదిబట్ల సూర్య కామేశ్వరరావు సంస్మరణ సభ శనివారం స్థానిక రామచంద్రరావు పేటలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించారు. ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327 డిస్కం అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యుత్ సంస్థలో సంస్కరణల ప్రభావం భవిష్యత్‌లో ఉద్యోగులు, వినియోగదారులకు తీవ్ర నష్టం వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత స్థానిక రామకృష్ణాపురంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో కామేశ్వరరావు విగ్రహాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కేఎం అంబేద్కర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టెక్నికల్ పి.రాధాకృష్ణ, ఉద్యోగసంఘాల నాయకులు పాతాళ శ్రీనివాస్, ఎం రమేష్, వి.రాము, ఎస్‌డీ అబ్బాస్, టీవీవీఎస్ రామకృష్ణ విద్యుత్ సంస్థ అధికారులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ సాల్మన్ రాజు

వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ

ఏలూరు (టూటౌన్): వీధి కుక్కలకు రేబిస్ వాక్సినేషన్, సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేస్తున్నట్టు ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. ఏలూరులోని పశుసంవర్ధక ఆసుపత్రిలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలను శనివారం ఆయన ప్రారంభించారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో సుమారుగా 1900 వీధి కుక్కలు ఉన్నాయని, వీటి వల్ల ముఖ్యంగా చిన్నపిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలను వీధి కుక్కల బారీ నుంచి రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్యానాకు చెందిన స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు, రాబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఏలూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి హెల్త్ ఆఫీసర్ జి.చంద్రయ్య, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం, హర్యానాకు చెందిన స్నేహ యానిమల్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ హేమంత్, జిల్లెళ్లమూడి నరసింహారావు, డాక్టర్ వెంకయ్య, మున్సిపల్ ఇంజినీర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలపై మాట్లాడుతున్న హేమంత్

ఆసుపత్రి వద్ద సిబ్బంది నిరసన

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ ఏరియా హాస్పటల్ శానిటరీ సిబ్బంది, స్వీపర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు టౌన్ కార్యదర్శి ఎస్‌కే సుభాషిని మాట్లాడుతూ మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలన్నారు. తమకు రూ.16 వేల వేతనానికి రూ.2000 పీఎఫ్ నిమిత్తం కట్ అవుతుండగా, రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని, మిగిలిన రూ.2 వేలు ఏమయ్యాయో తెలియడంలేదని చెప్పారు. వెంటనే సదరు మొత్తాన్ని ఎన్ని నెలలు రావాలో వెంటనే చెల్లించాలని కోరారు. జీఓ 36 ప్రకారం వర్కర్లకు రూ.21 వేలు ఇవ్వాలని, సూపర్ వైజర్లకు రూ.24 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు జతల యూనిఫాం, సబ్బులు, కొబ్బరినూనె, గమ్ బూట్లు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీ కమలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు దయామణి, కార్యదర్శి మేరీ, మున్సిపల్ వర్కర్స్ టౌన్ అధ్యక్షుడు రేలంగి నాగరాజు, కార్యదర్శి జి.లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు బి.బాలరాజు, వెంకటేష్, చంద్రకళ, శకుంతల, సీత, వెంకటేశ్వరరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న శానిటరీ సిబ్బంది, స్వీపర్లు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	02
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	18
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	21
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	80
పచ్చిమిర్చి	24-30	బీట్‌రూట్	60
కాకర కాయలు	28-34	కీరా దోస	40
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	44	అల్లం	70
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	56	పాలకూర	10
దొండకాయలు	32	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-58	గోంగూర	07
గోరుచిక్కుడు	34	పుదీనా	05
దోసకాయలు	24-28	బఠాణీ	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

పింఛన్ కోసం వృద్ధుల పాట్లు



గుంటుపల్లిలో పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు

కామవరపుకోట: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పింఛన్‌దారులకు ప్రయాస తప్పడం లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలో క్రమం తప్పకుండా వాలంటీర్లు ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ అందజేసేవారు. లబ్ధిదారులు ఉన్నచోటికే వెళ్లి పింఛన్ అందజేసేవారు. కామవరపుకోట మండలం గుంటుపల్లిలో శనివారం పింఛను తీసుకోవడానికి వచ్చిన వృద్ధులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు పడ్డారు. పింఛన్ ఇస్తారని చెప్పటంతో ఏలూరులో తన కూతురు వద్ద ఉంటున్నాని దేవరపల్లి వీరమ్మ శనివారం ఉదయాన్నే గుంటుపల్లి వచ్చి పంచాయతీ కార్యాలయం వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. స్థానికుడైన రెడ్డి నాగేష్ తన ఇంటి వద్ద ఎదుచూసి ఎదురుచూసి ఎంతకీ అధికారులు రాకపోవడంతో పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. తమను అధికారులెవ్వరూ పట్టించుకోలేదని లబ్ధిదారులు వాపోయారు.

తేమ శాతం నిబంధనలు సడలించాలి

భీమడోలు: ఫెంగల్ తుఫాన్ వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తేమ శాతం నిబంధనను సడలించి, కల్లాల్లోని ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లోని రహదారులపై ఆరబోసిన ధాన్యాన్ని శనివారం వారు పరిశీలించారు. రైతులు, కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా ఆచరణలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని పేర్కొన్నారు. ఒక వైపు తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించే విషయంలో పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేదని తెలిపారు. సరిపడా గోనె సంచులు అందుబాటులో లేవని, చిరిగిన గోనె సంచులు అందిస్తున్నారని వాపోయారు. వాహనాలు ఏర్పాట్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, కొన్ని చోట్ల ధాన్యం తడిసిపోవడం వల్ల మరలా ఆరబెట్టుకునేందుకు సమయం పడుతుందని వివరించారు. దీంతో ఖర్చులు పెరిగి రైతులు నష్టపోతున్నారని తెలిపారు. 25 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఇంకా రైతుల వద్దకు చేరలేదన్నారు. కార్యక్రమంలో రైతులు సీహెచ్ రాజు, ఏ.శ్రీను, గంటా రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలి

ఉంగుటూరు: ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం బకాయిలను వెంటనే విడుదల చేయాలని పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ కృష్ణ తేజను కోరినట్టు ఉంగుటూరు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తెలిపారు. పలు సమస్యలను వివరించేందుకు ఎంపీపీలందరూ కృష్ణ తేజను శనివారం అమరావతిలో కలిసినట్టు పేర్కొన్నారు. మండల పరిషత్‌కు ఇప్పుడున్న నిధుల మంజూరు అథారిటీని రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని కోరామని తెలిపారు.